# ప్రాణప్రతిష్ఠకు అంకురార్పణ

- అయోధ్య రామాలయంలో సంప్రదాయ వైదిక పూజలు ప్రారంభం
- బాలరాముడిగా మైసూర్ శిల్పి యోగిరాజ్ చెక్కిన విగ్రహం ఎంపిక
- భక్తుల కోసం అయోధ్య విశేషాలతో 'దివ్య్ అయోధ్య' యాప్ విడుదల



గర్భగుడికి బంగారు తలుపుల ఏర్పాటు

అయోధ్య/న్యూఢిల్లీ, జనవరి 16: బాలరాముడి(రామ్‌లల్లా) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి అయోధ్య సిద్ధమైంది. ఈ నెల 22న జరుగనున్న ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ కాంప్లెక్స్ వద్ద మంగళవారం నుంచి సంప్రదాయ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ వెల్లడించారు. ఇవి 21వ తేదీ వరకు జరుగుతాయని, 22న మధ్యాహ్నం 12.20 గంటలకు బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ప్రారంభమవుతుందని ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో సంగీత ప్రదర్శన ఉంటుందని చంపత్ రాయ్ పేర్కొన్నారు. ఆలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో రామ భక్తులు తమ భావోద్వేగాలు పంచుకొంటూ షార్ట్ వీడియో చేసి #ShriRamHomecoming ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పోస్టు చేయాలని ట్రస్టు విజ్ఞప్తి చేసింది.




అయోధ్యలోని లతా మంగేష్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన రాముడి సైకత శిల్పం

### భక్తుల కోసం 'దివ్య్ అయోధ్య' యాప్

భక్తుల కోసం యూపీ ప్రభుత్వం 'దివ్య్ అయోధ్య' యాప్ విడుదల చేసింది. యాప్‌లో నగరంలోని వివిధ ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రదేశాల సమాచారం ఉంటుంది. హోటళ్లు, టూరిస్టు గైడ్‌లు వంటి వాటిని ముందస్తుగా ఈ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

### స్కామ్‌లకు తెరలేపిన మోసగాళ్లు

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమం పేరుతో సైబర్ నేరగాళ్లు పలు స్కామ్‌లకు తెరలేపారు. ఆన్‌లైన్‌లో ప్రసాదం, ఆలయానికి విరాళాలు, ఆలయ ప్రవేశానికి వీఐపీ పాస్ అంటూ భక్తులకు వివిధ మాధ్యమాల ద్వారా సందేశాలు, లింకులు పంపుతూ దోపిడీ కుట్రలకు పాల్పడుతున్నారు.

### రాజకీయ కార్యక్రమం: రాహుల్

ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కాకూడదన్న కాంగ్రెస్ నిర్ణయంపై ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ఎన్నికల నేపథ్యంలో దీన్ని బీజేపీ, ఆరెస్సెస్‌లు ఒక రాజకీయ కార్యక్రమంలా మార్చాయని విమర్శించారు. మరోవైపు 22న కోల్‌కతాలో 'సామరస్యం కోసం ర్యాలీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమత ప్రకటించారు. ప్రాణప్రతిష్ఠ రాజకీయ నేతల పని కాదని, అది పూజారులు నిర్వహించే కార్యక్రమం అని అన్నారు.

### అయోధ్య రైలు సర్వీసుల రద్దు

అయోధ్యకు రాకపోకలు సాగించే 36 రైలు సర్వీసులను రద్దు చేయడం లేదా మార్గం మార్చడం జరిగిందని అధికారులు వెల్లడించారు. లక్నో-బారాబంకి-అయోధ్య-షాగంజ్-జఫ్రాబాద్ సెక్షన్ పరిధిలో రైల్వే ట్రాక్ డబ్లింగ్, ఇతర పనుల నేపథ్యంలో ఈనెల 22 వరకు 36 రైలు సర్వీసులపై ప్రభావం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

### 7 రోజుల పూజల షెడ్యూల్

- *జనవరి 16:* ప్రాయశ్చిత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సరయూ నది ఒడ్డున 'దశవిధ' స్నానం, విష్ణు పూజ, గోపూజ జరుగుతాయి.
- *జనవరి 17:* రామ్‌లల్లా విగ్రహం ఊరేగింపుగా అయోధ్యకు చేరుకొంటుంది. మంగళ కలశంతో సరయూ జలాన్ని తీసుకొని భక్తులు ఆలయానికి చేరుతారు.
- *జనవరి 18:* గణేష్ అంబికా పూజ, వరుణ పూజ, మాతృక పూజ, బ్రాహ్మిణ్ వరణ్, వాస్తు పూజలు జరుగుతాయి.
- *జనవరి 19:* యజ్ఞం ప్రారంభం. తర్వాత 'నవగ్రహ', 'హవన్' స్థాపనను నిర్వహిస్తారు.
- *జనవరి 20:* గర్భగుడిని సరయూ నీళ్లతో శుద్ధి కార్యక్రమం. తర్వాత వాస్తు శాంతి, 'అన్నదివస్' ఆచారాలను పూజారులు నిర్వహిస్తారు.
- *జనవరి 21:* రామ్‌లల్లా విగ్రహానికి 125 కలశాలతో అభిషేక కార్యక్రమం.
- *జనవరి 22:* ఉదయం పూజల తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రధానమైన మహోత్సవ ప్రాణ ప్రతిష్ఠ వేడుక జరుగుతుంది.

### ముఖం చంద్రుడిలా ప్రకాశిస్తుంది..

కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ తయారు చేసిన బాల రాముడి విగ్రహాన్ని అయోధ్య ఆలయంలో ప్రాణప్రతిష్ఠకు ఎంపిక చేసినట్టు చేసినట్టు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ సోమవారం ప్రకటించారు. కృష్ణ శిల(నల్ల రాయి)పై మలచిన ఈ విగ్రహం 150-200 కిలోల బరువు ఉంటుందని తెలిపారు. బాలరాముడి విగ్రహ రూపురేఖల్ని చంపత్ రాయ్ గతంలో వర్ణిస్తూ.. రాముడి కండ్లు తామర పువ్వు రేకుల మాదిరిగా ఉంటుందని, ఆయన ముఖం చంద్రుడిలా ప్రకాశిస్తుందని పేర్కొన్నారు. పొడవాటి చేతులతో విగ్రహం తయారైందని తెలిపారు.

**కంటికి గాయమైనా..:** యోగిరాజ్ కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. రామ్‌లల్లా విగ్రహాన్ని మలచేందుకు యోగిరాజ్ ఎంతో కష్టపడ్డాడని, గట్టిగా ఉండే శిలను చెక్కే సమయంలో కంటికి గాయమైందని, అయినా నొప్పిని భరిస్తూనే నిష్ఠగా పనిచేశాడని తెలిపారు. అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠాపనకు పరిపూర్ణమైన విగ్రహాన్ని అందించేందుకు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడని యోగిరాజ్ భార్య విజేత తెలిపారు.



## హైదరాబాద్ నుంచి 1,265 కిలోల భారీ లడ్డు

కంటోన్మెంట్, జనవరి 16: అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో హైదరాబాద్ కంటోన్మెంట్ పికెట్ ప్రాంతానికి చెందిన శ్రీరామ క్యాటరింగ్ సర్వీసెస్ యజమాని నాగభూషణం రెడ్డి, కృష్ణకుమారి దంపతులు ప్రత్యేకంగా 1,265 కేజీల భారీ లడ్డును తయారు చేయించారు. దీన్ని వీరు అయోధ్యకు పంపించనున్నారు. ఆలయ నిర్మాణానికి భూమిపూజ జరిగిన మొదలు రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు 1,265 రోజులు పట్టింది. దీనికి గుర్తుగా నాగభూషణం దంపతులు అదే సంఖ్య బరువు గల లడ్డు తయారు చేయించారు. బుధవారం ఉదయం 6 గంటలకు పికెట్లోని తమ నివాసం నుంచి లడ్డు శోభాయాత్రను ప్రారంభిస్తామని నాగభూషణం రెడ్డి తెలిపారు.

## మథుర షాహీ ఈద్గాలో సర్వేపై సుప్రీం స్టే

- అలహాబాద్ హైకోర్టు తీర్పు నిలిపివేత



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శ్రీకృష్ణుడి జన్మభూమి వివాదంపై సుప్రీం కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. మథుర ఆలయ సమీపంలోనే ఉన్న షాహీ ఈద్గా మసీదులో శాస్త్రీయ సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన అనుమతిని నిలిపి వేసింది. అదే సమయంలో ఈ వివాదంపై హైకోర్టులో కేసు విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. మథురలో శ్రీకృష్ణుడు పుట్టిన స్థలంలో షాహీ ఈద్గా మసీదును నిర్మించారని, దీనిపై సర్వే చేయించాలంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన అలహాబాద్ హైకోర్టు.. న్యాయస్థానం పర్యవేక్షణలో షాహీ ఈద్గాలో శాస్త్రీయ సర్వే నిర్వహించాలని ఆదేశించింది. దాని పర్యవేక్షణకు అడ్వకేట్ కమిషనర్ నియామకానికి అనుమతి ఇచ్చింది. తీర్పును సవాల్ చేస్తూ ముస్లిం కమిటీ సుప్రీంను ఆశ్రయించగా ధర్మాసనం హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. దీనిపై మీ స్పందన తెలియజేయాలంటూ హిందూ సంస్థలకు నోటీసులిచ్చింది.

## కునోలో మరో చీతా మృతి

- ఇప్పటివరకు 10 మరణం

భోపాల్, జనవరి 16: కునో నేషనల్ పార్క్‌లో చీతాల మరణ మృదంగం కొనసాగుతున్నది. తాజాగా మంగళవారం మరో చీతా మృతి చెందింది. దీంతో నమీబియా నుంచి భారత్‌కు తీసుకొచ్చిన చీతాల్లో 2022 నుంచి 10 చీతాలు మృతి చెందినట్టయ్యింది. వీటిలో 7 పెద్దవి, మూడు కూనలు ఉన్నాయి. శౌర్య అనే చీతా మంగళవారం మధ్యాహ్నం మరణించినట్టు ఫారెస్ట్ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ తెలిపారు. శౌర్య మృతికిగల కారణాలు పోస్ట్‌మార్టం అనంతరమే తెలుస్తాయని పేర్కొన్నారు. నమీబియా నుంచి, దక్షిణాఫ్రికా నుంచి రెండు దఫాలుగా భారత్‌కు చీతాలను తీసుకొచ్చారు. వీటిని మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో వదిలారు. ఆ తర్వాత కొద్ది రోజులకే వివిధ కారణాలతో చీతాలు ఒక్కొక్కటిగా మరణించటం ప్రారంభమైంది.

### ఎన్నికల ప్రచారానికి ఏఐను ఉపయోగించుకోనివ్వం

న్యూఢిల్లీ, జనవరి 16: భారతదేశం సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ అమెరికాకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సంస్థ ఓపెన్ ఏఐ కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ ప్రచారానికి, ఎన్నికల్లో లాబీయింగ్‌కు తమ ఏఐ (కృత్రిమ మేధ)ను ఉపయోగించుకునేందుకు అనుమతించబోమని స్పష్టం చేసింది.

### పేదరికం పోవడానికి 230 ఏండ్లు

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రపంచ ఆస్తుల్లో 43 శాతం కేవలం ఒక శాతం సంపన్న వర్గాల గుప్పిట్లోనే మగ్గుతున్నాయి. ఇదే ధోరణి మధ్యప్రాచ్యం, ఆసియా, యూరప్ దేశాల్లో కూడా కొనసాగుతున్నది. అక్కడ కూడా కేవలం ఒక శాతం సంపన్న వర్గాల చేతిలో 47 నుంచి 50 శాతం ఆస్తులున్నట్టు ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడించింది. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం సమస్య సమసిపోవాలంటే మరో 200 ఏండ్లకు పైగా సమయం పడుతుందని వెల్లడించింది.

### రష్యాతో మూడో ప్రపంచ యుద్ధం!

బెర్లిన్, జనవరి 16: ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరింత విస్తరించి మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందని జర్మనీ ఆందోళన చెందుతున్నది. ఈమేరకు జర్మనీ స్థానిక వార్తా పత్రిక 'బిల్డ్' తాజాగా వెలువరించిన వార్తా కథనం సంచలనం రేపింది. జర్మనీ రక్షణ శాఖకు చెందిన రహస్య పత్రాల్లోని కీలక సమాచారం ఆధారంగా ఈ కథనం ప్రచురించినట్టు 'బిల్డ్' తెలిపింది. ఈ కథనం ప్రకారం, వచ్చే ఏడాది నాటో కూటమి దేశాలను రష్యా టార్గెట్ చేస్తుందని, ఇది మూడో ప్రపంచ యుద్ధానికి ఆరంభమవుతుందని జర్మనీ ఆందోళన వ్యక్తం చేసింది.

### మయన్మార్ రెబల్స్ గుప్పిట కీలక ప్రాంతాలు

న్యూఢిల్లీ, జనవరి 16: మయన్మార్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం సెగ భారత సరిహద్దును తాకింది. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న పాలెట్వా పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రెబల్ గ్రూప్ అరాకన్ ఆర్మీ ప్రకటించింది. 2021 నుంచి మయన్మార్‌లో సైనిక పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే దీనిని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య కూటములు ఓ సంస్థగా ఏర్పడి సైన్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి.

### అమెరికా నౌకపై హౌతీల దాడి

జెరూసలేం, జనవరి 16: యెమెన్‌లోని తమ సైనిక స్థావరాలపై అమెరికా, బ్రిటన్ దాడులకు పాల్పడిన నేపథ్యంలో హౌతీ తిరుగుబాటుదారులు ప్రతీకార చర్యకు పాల్పడ్డారు. యెమెన్ తీరంలోని గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో అమెరికాకు చెందిన ఓ కంటెయినర్ నౌకపై సోమవారం క్షిపణితో దాడి చేశారు. దీంతో దాడికి గురైన జిబ్రాల్టర్ ఈగల్ నౌకలో మంటలు రేగినట్టు సమాచారం.

### తప్పుకున్న వివేక్ రామస్వామి

వాషింగ్టన్, జనవరి 16: అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీపడుతున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటున్నట్టు మంగళవారం ప్రకటించారు. పార్టీ అభ్యర్థిత్వం విషయంలో ప్రైమరీలో కీలకమైన అయోవా కాకసన్ ఎన్నికల్లో వివేక్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. డొనాల్డ్ ట్రంప్ 51శాతం ఓట్లు సాధించగా, వివేక్ రామస్వామికి కేవలం 7.7 శాతం వచ్చాయి. ఫలితాల తర్వాత వివేక్ రామస్వామి మాట్లాడుతూ, ట్రంప్‌నకు తన మద్దతు ఉంటుందని తెలిపారు.

## • క్షణాల్లో రోడ్డు .. మరుక్షణమే చుట్టేయొచ్చు!





క్షణాల్లో రోడ్డు వేసేలా టెక్నాలజీ అభివృద్ధి చెందింది. మారుమూల ప్రాంతాల్లో రహదారులు లేని చోట రోడ్‌వే కిట్‌తో సులభంగా ప్రయాణించవచ్చు. కాలువలు, ఎత్తుపల్లాలు, చిన్న చిన్న చెట్లు ఉన్న ప్రదేశాల్లోనూ ఈ కిట్‌తో అవతలకి దాటేయవచ్చు. అంతేకాదు.. దాటిన తర్వాత ఈ కిట్‌ను మళ్లీ చుట్టుకొని వెంట తీసుకెళ్లవచ్చు. ఇది చూడటానికి దుకాణాలకు అమర్చే షటర్‌లా ఉంటుంది. యంత్రం సాయంతో దీన్ని నేలపై పరుస్తారు. తర్వాత దీనిపై నుంచి వాహనాలు వెళ్లొచ్చు. అవి వెళ్లాక తిరిగి యంత్ర సాయంతో చుట్టుకొని తీసుకెళ్లవచ్చు.

## మరో వెయ్యి మందికి గూగుల్ ఉద్వాసన




న్యూఢిల్లీ, జనవరి 16: టెక్ కంపెనీలలో ఈ ఏడాది కూడా ఉద్యోగుల తొలగింపు కొనసాగుతున్నది. తాజాగా మరోసారి ఉద్యోగుల ఉద్వాసనకు టెక్ దిగ్గజం గూగుల్ రంగం సిద్ధం చేసుకుంది. సుమారు వెయ్యి మందిని ఇంటికి సాగనంపుతున్నట్టు ప్రకటించింది. హార్డ్‌వేర్, సెంట్రల్ ఇంజనీరింగ్, గూగుల్ అసిస్టెంట్ సహా పలు విభాగాలకు చెందిన వారిని తొలగిస్తూ సంబంధిత ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపింది. వ్యాపార ప్రాధమ్యాలలో మార్పుల కారణంగా తొలగింపులు అనివార్యమైందని, ఈ నిర్ణయం కష్టంగా ఉందని, దీనిని తెలియజేయడానికి చింతిస్తున్నట్టు పేర్కొంది. అర్హులైన ఉద్యోగులకు పరిష్కార వేతనం చెల్లిస్తామని, అదే విధంగా ఇతర విభాగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది.

### ప్రపంచంలోనే తెలివైన విద్యార్థుల్లో మన 'చక్రవర్తి'

వాషింగ్టన్, జనవరి 16: తొమ్మిదేండ్ల వయసున్న భారత సంతతికి చెందిన ప్రీషా చక్రవర్తి అరుదైన రికార్డును సాధించింది. 'ప్రపంచంలో తెలివైన విద్యార్థుల జాబితా'లో చోటు దక్కించుకున్నది. ప్రస్తుతం ఈ బాలిక అమెరికాలోని కాలిఫోర్నియాలో గ్రేడ్ 3 చదువుతున్నది. ప్రతిష్ఠాత్మక జాన్స్ హాప్‌కిన్స్ సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్ దాదాపు 90 దేశాలకు చెందిన 16,000 మంది విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి తెలివైన విద్యార్థుల జాబితాను రూపొందించింది.

### 'డీప్‌ఫేక్' కట్టడికి వారంలో కఠిన నిబంధనలు

న్యూఢిల్లీ, జనవరి 16: డీప్‌ఫేక్ అంశంపై జారీచేసిన అడ్వైజరీపై వివిధ సోషల్ మీడియా, డిజిటల్ సంస్థల నుంచి మిశ్రమ స్పందన వచ్చిందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. తప్పుడు సమాచార వ్యాప్తి, డీప్‌ఫేక్ వంటి వీడియోల కట్టడికి కఠిన చర్యలు తీసుకొంటున్నామని, ఇందుకు సంబంధించి మరో 7-8 రోజుల్లో సవరించిన ఐటీ నిబంధనలను జారీ చేస్తామని మంగళవారం వెల్లడించారు.

## ఉప్పు ప్రాణానికి ముప్పు

### అధిక ఉప్పు వాడకం వల్ల ఏటా 18.9 లక్షల మంది మృతి

### గుండె, కిడ్నీ, మెదడుపై ప్రభావం చూపుతోందన్న డబ్ల్యూహెచ్‌వో



జెనీవా, జనవరి 16: పరిమితికి మించి ఉప్పు వాడకంతో(రోజుకు 5 గ్రాములు మించి) మానవ ఆరోగ్యంపై ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లుతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. శరీరంలో కీలక అవయవాలు దెబ్బతిని ఏటా ప్రపంచవ్యాప్తంగా 18.9 లక్షల మంది చనిపోతున్నారని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది. రక్తపోటు, గుండె సమస్యలు, గ్యాస్ట్రిక్ క్యాన్సర్, స్థూలకాయం, కిడ్నీ వ్యాధులు బారినపడే అవకాశం పెంచుతుందని తెలిపింది. శరీరంలో 'సోడియం' కీలకమే అయినా, రోజుకు 2000 మిల్లీగ్రాములు మించి తీసుకోకూడదు. 5 గ్రాముల ఉప్పు లేదా ఒక టేబుల్ స్పూన్‌లో సోడియం 2000 మిల్లీగ్రాముల వరకు ఉంటుంది.

**క్రమంగా తగ్గించాలి!**

ఉప్పు వాడకం నుంచి క్రమంగా బయటపడాలి. ఉప్పుకు బదులు నిమ్మరసం, వెనిగర్, వోమ, నానబెట్టిన సబ్జ గింజలు మొదలైనవి ఆహారంలో వాడొచ్చునని డబ్ల్యూహెచ్‌వో సూచిస్తున్నది. ప్రాసెస్ చేసిన ఆహారం మానేయాలి. తప్పదనుకుంటే 100 నుంచి 120 మిల్లీగ్రాముల వరకు సోడియం ఉన్న ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకొవచ్చు.

## 31లోగా ఫాస్టాగ్‌లకు కేవైసీ చేయించుకోండి

న్యూఢిల్లీ, జనవరి 16: వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను ఈ నెల 31లోగా కేవైసీ చేయించుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఒక ప్రకటనలో కోరింది. అలా చేయకపోతే అవి డీ యాక్టివేట్ అవుతాయని పేర్కొంది. ఒకే ఫాస్టాగ్‌ను బహుళ వాహనాలను వినియోగించకుండా అరికట్టడానికి 'ఒకే ఫాస్టాగ్.. ఒకే వాహనం' విధానం అమలుకు దీనిని తెచ్చినట్టు చెప్పారు. ఇప్పుడు కొత్తగా ఫాస్టాగ్ చేయించుకున్న ఖాతాలు మాత్రమే క్రియాశీలకంగా ఉంటాయని, పాతవన్నీ జనవరి 31 తర్వాత రద్దవుతాయని ఆ ప్రకటనలో పేర్కొంది. చాలా వాహనాలకు ఒకటి కంటే ఎక్కువ ఫాస్టాగ్‌లు ఉన్నట్టు గుర్తించామని, కేవైసీ లేకుండా ఫాస్టాగ్ చేయడం ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది.

### సిమ్, ఇంటర్నెట్ లేకుండా ఫోన్లో వీడియో స్ట్రీమింగ్!

న్యూఢిల్లీ, జనవరి 16: మొబైల్ యూజర్లు సిమ్ కార్డు, ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా వీడియోలను చూసే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానున్నది. సంబంధిత అధునాతన సాంకేతికత 'డైరెక్ట్ టూ మొబైల్(డీ2ఎం)' బ్రాడ్‌కాస్టింగ్ సమీప భవిష్యత్తులో వాస్తవ రూపంలోకి రానున్నది. దీనిపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర కీలక విషయాలు వెల్లడించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ డీ2ఎం సాంకేతికత ట్రయల్స్‌ను త్వరలో 19 నగరాల్లో చేపడతామని తెలిపారు. ఈ టెక్నాలజీకి 470-582 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను రిజర్వ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో యూజర్లు వినియోగిస్తున్న కంటెంట్‌లో 69 శాతం వీడియో ఫార్మాట్‌లోనిదేనని పేర్కొన్నారు. 25-30 శాతం వీడియో కంటెంట్ ట్రాఫిక్‌ను డీ2ఎంకు మార్చడం ద్వారా 5జీ నెట్‌వర్క్‌లపై భారం తగ్గించొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ డీ2ఎం సాంకేతికతను పరీక్షించేందుకు గత ఏడాది బెంగళూరు, న్యూఢిల్లీ పరిధిలోని కర్తవ్యపథ్, నోయిడాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. డీ2ఎం బ్రాడ్‌కాస్టింగ్ టెక్నాలజీని ఐఐటీ కాన్పూర్, సాంఖ్య ల్యాబ్స్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.

# మన ఫ్లైట్.. ఎంతో లేట్!

- నరకానికి నకలుగా మారుతున్న విమాన ప్రయాణం
- పొగ మంచు తదితర కారణాలతో గంటల తరబడి ఆలస్యం
- ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోని సంస్థలు, సిబ్బంది

*హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ):* ఖర్చయినా త్వరగా గమ్యస్థానాలను చేరుస్తుంది.. ప్రయాణం సుఖవంతంగా ఉంటుంది అని చాలామంది ఖర్చుకు వెనుకాడకుండా విమానాల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల 'నేనెక్కే విమానం రోజుల తరబడి లేట్' అన్నట్టు నరకానికి నకలుగా ప్రయాణం మారింది. దీనికి ప్రధాన కారణం వాతావరణ పరిస్థితులే అయినప్పటికీ, కొన్ని విమాన సంస్థల నిర్లక్ష్యం కూడా తక్కువేమీ కాదు. 'ప్రయాణికులే మా దేవుళ్లు' అన్నది నినాదంగా మాత్రమే మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

**విమాన సిబ్బందితో వాగ్వాదం**

పొగమంచు, ఇతర కారణాలతో విమానాలు ఆలస్యం అవుతుండటంతో గంటల తరబడి ప్రయాణికులు ఎదురు చూడాల్సి వస్తున్నది. విమానం ఎప్పుడు వస్తుందో, పోతుందో కూడా సిబ్బంది సరైన సమాధానం చెప్పడం లేదు. దీంతో ప్రయాణికులు సహనాన్ని కోల్పోతున్నారు. కిక్కిరిసిన విమానాశ్రయాలలో గంటల తరబడి పడిగాపులు కాయడం, సిబ్బందితో ప్రయాణికులు వాగ్వాదానికి దిగుతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విమానయాన సంస్థలు నిబంధలను పట్టించుకోవడం లేదని, ప్రయాణం అన్ని గంటలు ఆలస్యమైనప్పుడు ప్రయాణికులకు వసతి సౌకర్యం కల్పించాలని, కానీ దీనిని ఏ ఎయిర్‌లైన్స్ పాటించడం లేదని, ఇదేమని అడిగిన తనతో ఇండిగో మేనేజర్ నేత్ర దురుసుగా ప్రవర్తించారని ప్రజ్ఞ అనే ప్రయాణికురాలు వీడియో విడుదల చేసింది.

**ఆలస్యానికి మారుపేరుగా ఇండిగో**

విమానయాన సంస్థ ఇండిగో ఇటీవల కాలంలో తరచూ విమానాల రద్దు, ఆలస్యంతో ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నది. దీనికి తోడు ఈ సంస్థలో సిబ్బంది లేమి, పైలట్ల కొరత వంటి కారణాలతో తరచూ ఇండిగో విమానాలు జీవితకాలం లేటు అన్నట్టు తయారవుతున్నాయని ఒక ప్రయాణికుడు ఆరోపించాడు. ఆదివారం ఇండిగో ఫ్లైట్ 6ఈ2175లో పైలట్‌పై ప్రయాణికుడు దాడి చేశాడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

***76 విమానాలు రద్దు.. 600 ఆలస్యం***

ఉత్తర భారత ప్రాంతంలో ఆవరించిన విపరీతమైన మంచు కారణంగా ఈ సీజన్‌లోనే అత్యధికంగా ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 76 విమానాలు రద్దు కాగా, 600 విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. దీని ప్రభావం దేశంలోని మిగతా విమానాశ్రయాలపై కూడా పడటంతో అక్కడ కూడా ప్రయాణికులకు గంటల తరబడి ఎదురుచూపులు తప్పలేదు. అమృతసర్, పఠాన్‌కోట్, జమ్ము, ఛండీగఢ్, లక్నో, అలహాబాద్, వారణాసి, పాట్నా, హైదరాబాద్‌లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గత ఆదివారం చెన్నై ఎయిర్‌పోర్టులో కూడా ఉదయం 5 నుంచి 8 గంటల వరకు ఇదే పరిస్థితి ఏర్పడింది. మంచుకు తోడు రాష్ట్రంలో భోగి మంటల కారణంగా ఏర్పడిన పొగ వల్ల కూడా ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు చెప్పారు. జనవరిలో సగటున 21.6 రోజులు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పొగమంచు ప్రభావం చూపినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

**ఇబ్బందుల తొలగింపునకు ఆరు సూత్రాల ప్రణాళిక**

ఇటీవల విమాన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై కేంద్ర విమానయాన శాఖ స్పందించింది. హైదరాబాద్ సహా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు ఎయిర్‌పోర్టుల్లో వార్ రూమ్‌లను ఏర్పాటు చేయనుంది. ఇందులో చోటు చేసుకునే సంఘటనలను రోజూ కేంద్రానికి నివేదించాలి. పొగమంచు, ఇతర కారణాల జాతీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇబ్బందులను తొలగించడానికి కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం ఆరు సూత్రాల ప్రణాళికతో మార్గదర్శకాలను ప్రకటించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి పాటించాల్సిన మార్గదర్శకాలను ఎయిర్‌లైన్స్‌కు జారీ చేశారు.



ముంబైలో రన్ వే పైనే కూర్చొని ఆహారాన్ని తింటున్న ప్రయాణికులు

***3 గంటలు మించితే రద్దు చేయవచ్చు***

3 గంటల మించి ఆలస్యం అవుతాయనుకున్న సర్వీసులను విమానయాన సంస్థలు తగినంత ముందుగానే రద్దు చేయవచ్చునని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సోమవారం ప్రకటించింది. విమానయాన సంస్థలన్నీ విమానాల ఆలస్యానికి సంబంధించిన సమాచారాన్ని నిర్దిష్ట సమయంతో సహా ప్రయాణికులకు తెలపాలి. విమానాల ఆలస్యానికి సంబంధించిన సమాచారాన్ని అర్థమయ్యేలా వివరించాలి.

### విమానం ఆలస్యంతో నేలపైనే భోజనం

పొగమంచు కారణంగా గంటలకొద్దీ ఆలస్యం జరిగి ముంబై విమానాశ్రయంలో ల్యాండైన ప్రయాణికులు విమానం పక్కనే నేలపై కూర్చుని భోజనం చేస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. దీనిపై స్పందించిన పౌర విమానయాన శాఖ విమానయాన సంస్థ ఇండిగోకు నోటీసులను జారీ చేస్తూ మంగళవారం సాయంత్రం లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రయాణికుల భద్రత, సౌకర్యం, నిర్వహణ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా విమాన కార్యకలాపాలు కొనసాగించారని, ఈ విషయంలో ఇండిగో, ముంబై విమానాశ్రయం తగు రీతిలో వ్యవహరించ లేదని తన నోటీసులో పేర్కొంది. పొగమంచు కారణంగా గోవా నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఇండిగో విమానం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దిగింది. అప్పటికే చాలా ఆలస్యం కావడంతో ప్రయాణికులు కిందకు దిగి విమానం పక్కనే నేలపై కూర్చుని భోజనం చేశారు. ఈ దృశ్యాలు వైరల్ కావడంతో కేంద్రం తీవ్రంగా స్పందించి నోటీసులు జారీ చేసింది.